నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట

3 | మహబూబ్‌నగర్, గురువారం 9 మే 2024 | MAHABUBNAGAR NARAYANPET




## రేవంత్ పాలనలో కన్నీళ్లే మిగిలాయి

- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్పీ

తనను పార్లమెంట్‌కు పంపిస్తే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ ఎన్నికలు కేసీఆర్ నిజాయితీ పాలనకు, ఆరు నెలల కాంగ్రెస్ అబద్ధపు పాలనకు మధ్య జరుగుతున్నవన్నారు. తెలంగాణ కోసం పదవులు త్యాగం చేసినోళ్లకు.. తెలంగాణ ద్రోహులకు మధ్య జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలకు కన్నీళ్లే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలను నమ్మొద్దని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. బీజేపీ దుర్మార్గమైనదని, వారికి ఎవరూ ఓటు వేయవద్దని సూచించారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే దళితుల మూతికి ముంత కట్టే రోజులొస్తాయన్నారు. మల్లు రవి రెండుసార్లు ఎంపీగా గెలిచి ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రంలో దోపిడీ పాలన పోవాలంటే బీఆర్ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



గద్వాల రోడ్‌షోకు అశేషంగా తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు, అభిమానులు



# గ్యారెంటీలన్నీ గారడీలే..

- ప్రజలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్
- స్కీంలు అమలు చేశామంటూ సిగ్గులేని ప్రకటనలు
- పేదల పొట్టకొట్టి పెద్దల కడుపునింపిన మోదీ
- కాంగ్రెస్, బీజేపీ తులసీవనంలో గంజాయి మొక్కలు
- రెండు పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి
- గులాబీ పార్టీకి 10 నుంచి 12 సీట్లు వస్తే రాష్ట్ర రాజకీయాలను శాసించనున్న కేసీఆర్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కల్వకుర్తి, అచ్చంపేట, గద్వాలలో బీఆర్ఎస్ రోడ్‌షోలకు నీరా'జన'ం




కల్వకుర్తిలో కేటీఆర్ రోడ్‌షోకు ర్యాలీగా తరలివెళ్తున్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు


కల్వకురి/అచ్చంపేట/గద్వాల, మే 8 : 'కాంగ్రెస్ గ్యారెంటీలన్నీ గారడీలేనని, పరిపాలన అంటే పాన్‌డబ్బా నడపడం కాదు.. ముందుచూపుతో ఆలోచిస్తూ ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ, ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడమే పాలన దక్షత.. ఇది కేసీఆర్‌కు పుష్కలంగా ఉంది' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ తులసీవనం లాంటిదని.. అందులో కాంగ్రెస్, బీజేపీలు గంజాయి మొక్కల్లాంటి వారని.. వాటిని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తీసివేయాలన్నారు. 'పేగులు మెడలో వేసుకుంటా, కత్తెరను జేబులో పెట్టుకొని తిరుగుతానంటూ రోతమాటలు, వెకిలి చేష్టలతో రాష్ట్రం పరువు తీస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నటికీ పరిపాలనా దక్షుడు కాలేడు.. ప్రజలను నమ్మించి మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి, రేవంత్‌రెడ్డికి ఓట్లు అడిగే నైతిక హక్కులేదు' అని ఆయన మండిపడ్డారు. కల్వకుర్తిలోని హైదరాబాద్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అధ్యక్షతన, అచ్చంపేటలో బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు అధ్యక్షతన, గద్వాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రోడ్‌షోలలో కేటీఆర్ ప్రసంగించారు. ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని అమలు చేశామని హోర్డింగ్‌లతో ప్రచారం చేసుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి సిగ్గుండాలని దుయ్యబట్టారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కి, ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగటానికి గ్రామాల్లోకి వస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికల వరకు ఓడ మల్లన్న.. ఎన్నికలయ్యాక బోడమల్లన్న అనే తీరుగా పాలనను విస్మరించి రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. లంకెబిందెలు ఉంటాయనుకుంటే ఖాళీ బిందెలు ఉన్నాయంటున్న రేవంత్‌రెడ్డికి ఇంతకుముందు కొండారెడ్డిపల్లిలో తాను చేసిన పాత జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయేమోనంటూ సెటైర్లు వేశారు. హామీలను అమలు చేయకుండా.. పేగులు మెడలేసుకుంటా.. కత్తెర జేబులో పెట్టుకొని తిరుగుతానంటూ వ్యర్థపు మాటలతో ప్రజలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం కాంగ్రెస్ మార్క్ దోపిడీకి తెరలేపిందని విమర్శించారు. ప్రభుత్వ దవాఖానను కట్టించిన బంగారం లాంటి గువ్వల బాలరాజును.. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓడించారని.. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను కూడా పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. గ్యారెంటీలన్నీ గారడీలేనని ఎద్దేవా చేశారు. గుంపు మేస్త్రీ ప్రభుత్వం మెడలు వంచాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అత్యధిక స్థానాల్లో గెలిపించాలన్నారు. రాములును ఎంపీగా గెలిపిస్తే మోదీ ఏం చేసిండని బీజేపీలోకి పోయారో జిల్లా ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడే కరెంట్, నీళ్లు, రైతుబంధు బాగుండెనన్నారు. మోచేతికి బెల్లం పెట్టింద్రు, జాబ్ క్యాలెండరన్నరు.. ఏదీ దిక్కు లేదన్నారు. ఒక్కసారి మోసపోతే మోసం చేసినోళ్లది తప్పు, మళ్లీ మళ్లీ మోసపోతే తప్పు మనదే అవుతుందన్నారు. రాములును ఎంపీగా గెలిపిస్తే బాహుబలిని కట్టప్ప వెన్నుపోటు పొడిచినట్లు చేశారన్నారు. ఈ ఎన్నికల్లో చోటా భాయ్ కాంగ్రెస్, బడే భాయ్ బీజేపీలతో బీఆర్ఎస్ పోటీపడుతుందని.. గులాబీ పార్టీకి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రజలపై ఉన్నదన్నారు. 'కృష్ణా జలాల్లో అన్యాయం జరుగుతున్నా కాంగ్రెస్ పార్టీ నోరు మెదపడం లేదు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా కేంద్రం పట్టించుకోలేదు. ఇప్పుడే ముఖం పెట్టుకొని ఓట్లు అడుగున్నారు.' అని దుయ్యబట్టారు. 'రామ మందిరం నిర్మించాం.. మాకే ఓట్లు వేయాలని అంటున్న బీజేపీ అంటోంది.. రాష్ట్రంలో కేసీఆర్ యాదాద్రి లక్ష్మీనర్సింహ్మ స్వామి ఆలయాన్ని నిర్మించారు.. ఆధునిక దేవాలయాలైన సాగునీటి ప్రాజెక్టులను నిర్మించారు.. కేంద్రం దీనికేమి సమాధానం చెప్తుంది' అని ప్రశ్నించారు. క్రూడాయిల్ ధర తగ్గినా 34 శాతం పన్నులతో ప్రజలపై భారం మోపుతూ అదానీ, అంబానీలకు సంపదను దోచిపెట్టిందని దుయ్యబట్టారు. రామమందిరం మినహా ఇంకేమైనా అభివృద్ధి చేసి ఉంటే ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

### కేసీఆర్‌కు నమ్మకస్తుడు.. బండ్ల


గద్వాల ఎమ్మెల్యేకు మాటలు తక్కువ.. చేతలు ఎక్కువని కొనియాడారు. కేసీఆర్‌కు కృష్ణమోహన్‌రెడ్డి నమ్మకస్తుడని.. నియోజకవర్గ అభివృద్ధికి రూ.4,125 కోట్లు తీసుకొచ్చి అభివృద్ధి చేశాడని గుర్తు చేశారు. జిల్లాలను రద్దు చేస్తే రేవంత్‌రెడ్డి మరో తెలంగాణ ఉద్యమాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లాలను రద్దు చేసే కాంగ్రెస్‌కు ఓటేస్తారో.. జిల్లా ఇచ్చిన కేసీఆర్‌కు ఓటేస్తారో ప్రజలే తేల్చుకోవాలన్నారు. సీఎం ఊసరవెల్లిలా రంగులు మార్చినట్లు హామీల అమలు తేదీలు మార్చుతున్నాడన్నారు. గద్వాల ఎమ్మెల్యే జలదీక్ష చేస్తే తప్పా ప్రజలకు తాగునీటి విషయంలో సన్నాసి రేవంత్‌రెడ్డి చొరవ చూపలేదన్నారు. నిర్మల్ సభలో రాహుల్‌గాంధీ మహిళల ఖాతాల్లో రూ.2,500 జమ చేస్తున్నామని పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 10 నుంచి 12 సీట్లు గెలిస్తే రాష్ట్ర రాజకీయాలను కేసీఆర్ శాసిస్తాడని చెప్పారు. గద్వాలకు కేసీఆర్ మెడికల్, నర్సింగ్ కళాశాలలు ఇచ్చాడని, 300 పడకల దవాఖాన, వైద్య కళాశాల కోసం రూ.45 కోట్లు, జిల్లా దవాఖానలో రూ.229కోట్లతో రోగులకు అవసరమైన సౌకర్యాలను కేసీఆర్ ప్రభుత్వం కల్పించిదన్నారు. జిల్లాను రద్దు చేస్తే ఇవన్నీ రద్దయ్యే అవకాశం ఉందని.. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. గతంలో సర్కారు దవాఖాన అంటే రోగులు మేము రాము బిడ్డో అనే వారని.. కేసీఆర్ పాలనలో సర్కారు దవాఖానకే పరుగులు పెట్టారని గుర్తు చేశారు. కాళేశ్వరం, పాలమూర్–రంగారెడ్డి, నెట్టెంపాడ్ ప్రాజెక్టులను నిర్మించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలని కేసీఆర్ ప్రయత్నిస్తే వాటిని కాంగ్రెసోళ్లు అడ్డుకున్నారని విమర్శించారు. జన్‌ధన్ ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలిస్తామని మోసం చేసిన బీజేపీ నాయకులు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. కృష్ణాబేసిన్‌లో మన వాటా తేల్చాలని పదేండ్లుగా అడుగుతున్నా కేంద్రం పట్టించుకోలేదన్నారు. నడిగడ్డకు మోదీ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్.. మోదీ లైన్‌లో ఉన్నాడని, పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆయన బీజేపీలో చేరడం ఖాయమని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని కాంగ్రెస్ సన్నాసులు అంటున్నారు.. ఇద్దరం ఒకటే అయితే తన చెల్లిని జైల్లో ఎందుకు పెడతారని ప్రశ్నించారు. గద్వాలలో రోడ్ షోకు వచ్చిన జనాన్ని మిగతా ఏ జిల్లా రోడ్ షోలోనూ చూడలేదని.. ఇప్పుడే విజయోత్సవ ర్యాలీ చేసినట్లు ఉందన్నారు. ఐపీఎస్ అధికారిగా లక్షల మందికి సేవ చేసిన ఆర్ఎస్పీని ఎంపీగా గెలిపిస్తే ఇంకెంతమంది బాగుపడతారో గుర్తించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే సర్కారు మెడలు వంచి హామీలు అమలయ్యేలా చూస్తామన్నారు. రోడ్ షోల్లో పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జీలు చాడ కిషన్‌రెడ్డి, రంగినేని అభిలాష్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు ఎడ్మ సత్యం, నర్సింహాగౌడ్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ కార్పొరేషన్ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, జెడ్పీటీసీలు విజితారెడ్డి, దశరథ్‌నాయక్, వైస్‌ఎంపీపీ గోవర్ధన్, విజయ్‌గౌడ్, గణేశ్, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జైపాల్‌యాదవ్, చిత్రంలో కేటీఆర్, ఆర్ఎస్పీ



మాట్లాడుతున్న గువ్వల, చిత్రంలో కేటీఆర్, ఆర్ఎస్పీ



మాట్లాడుతున్న కేటీఆర్, అభివాదం చేస్తున్న బండ్ల

### మరింత అభివృద్ధి చేసుకుందాం : గద్వాల ఎమ్మెల్యే బండ్ల

అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఆశీర్వదించిన విధంగానే పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ప్రజలను కోరారు. కాంగ్రెస్ మాటలు నమ్మితే మరోసారి గోసపడి అభివృద్ధిలో వెనుకబడి పోతామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరునెలలు కావస్తున్నా.. ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదన్నారు. ప్రవీణ్‌కుమార్‌ను పార్లమెంట్‌కు పంపితే మన నడిగడ్డను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని ప్రజలకు వివరించారు.

### ఆర్ఎస్పీని గెలిపిద్దాం : గువ్వల

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు మాట్లాడుతూ మేధావి, విద్యావంతుడైన ఆర్ఎస్పీని గెలిపించాలని కోరారు. పేదల బతుకుల్లో మార్పు కోసం ఢిల్లీ గడ్డపై గళం విప్పేందుకు, కాంగ్రెస్ మోసాలు ఎండగట్టేందుకు కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

### రెండులక్షల మెజార్టీ ఇవ్వాలి : జైపాల్‌యాదవ్

బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో రెండులక్షల మెజార్టీ ఇవ్వాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కోరారు. విద్యావంతుడు, ఐపీఎస్‌గా సేవలందించిన వ్యక్తి, రాష్ట్రం ఏర్పడిన తర్వాత గురుకులాలను బలోపేతం చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించిన ఆర్ఎస్పీని గెలిపించి ఢిల్లీకి పంపుదామన్నారు.

## ప్రజలు కాంగ్రెస్, బీజేపీని నమ్మరు

- వారిని విశ్వసించేందుకు దేవుళ్లపై ఒట్లు : ఎమ్మెల్యే బండ్ల
- కారెక్కిన 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు



నమూనా బ్యాలెట్‌తో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల

గద్వాల, మే 8 : ప్రజలు కాంగ్రెస్, బీజేపీని నమ్మే పరిస్థితిలో లేరని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా గద్వాల మున్సిపాలిటీలోని ఒకటో వార్డులో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి చేయూతనిచ్చారన్నారు. రాష్ట్రంలో ఆంజనేయస్వామి ఆలయం లేని ఊరు లేదు.. అదేవిధంగా బీఆర్ఎస్ హయాంలో సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదని స్పష్టం చేశారు. గద్వాల అభివృద్ధి బీఆర్ఎస్ పాలనలోనే సాధ్యమైందని చెప్పారు. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పథకాల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలకు నమ్మకం సన్నగిల్లడంతో సీఎం రేవంత్ దేవుళ్లపై ఒట్టు పెట్టి నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీజేపీ మతతత్వ రాజకీయాలు చేస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు దండుకోవాలని చూస్తున్నదని ఆరోపించారు. జాతీయ పార్టీలు ఎన్ని డ్రామాలాడినా ప్రజలు నమ్మరని, వారికి ఈ ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్పీని గెలిపించాలని కోరారు. అనంతరం పార్టీ కార్యాలయంలో 15వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఫారూక్‌తోపాటు 50 మంది కార్యకర్తలు కారెక్కగా.. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, వైస్‌చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు నాగిరెడ్డి, మురళి, నాయకులు కృష్ణారెడ్డి, మోబిన్, గోవిందు, సాయిశ్యాంరెడ్డి, ధర్మానాయుడు, వంశీ, కురుమన్న, సవారన్న, చంద్రన్న, ఆంజనేయులు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమే..

- కేసీఆర్ బస్సు యాత్రతో రేవంత్‌కు వణుకు పుట్టింది : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



ఉపాధి పనులు చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో ఎంపీ మన్నె

హన్వాడ, మే 8 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే బతుకులు ఆగమైతాయని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని మునిమోక్షం, వేపూర్, గొండ్యాల గ్రామాల్లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. మోసపూరిత మాటలతో మరోసారి ఓట్ల కోసం వస్తున్నారని.. వారికి బుద్ధి చెప్పాలని సూచించారు. పంటలు ఎండి, అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ఒక్క ఎమ్మెల్యే కానీ.. మంత్రి కానీ పట్టించుకోలేదని విమర్శించారు. కేసీఆర్ బస్సుయాత్ర మొదలు పెట్టగానే సీఎం రేవంత్‌కు వణుకు పుట్టి రైతుబంధు డబ్బులు జమచేస్తున్నాడన్నారు. అధికారంలోకి వచ్చిన 90రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి.. ఐదు నెలలైనా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కులమతాల పేరిట ఓట్ల రాజకీయం చేస్తోందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మన్నెను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### మోసపూరిత మాటలు నమ్మొద్దు : ఎంపీ మన్నె

మోసపూరిత మాటలు నమ్మొద్దని.. ఆలోచించి ఓటు వేయాలని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. రైతులను సర్కారు ఆగం చేసి వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. దేవుళ్లు, కులమతాల పేరిట ప్రచారం చేస్తున్న బీజేపీతో జాగ్రతగా ఉండాలన్నారు. ఐదు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని, తనను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలరాజు, పార్టీ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్, వైస్ చైర్మన్ వెంకటయ్య, కృష్ణయ్యగౌడ్, ఎంపీటీసీలు శేఖర్, వెంకట్రాములు, నాయకులు లక్ష్మయ్య, బాలయ్య, చెన్నయ్య, నరేందర్, రమణారెడ్డి, జంబులయ్య, శ్రీనివాసులు, ఖాజాగౌడ్, హరిచందర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఆదరించాలి

- నీళ్లు తెచ్చే సోయి లేక పంటలను ఎండబెట్టిన సర్కారు.. : నిరంజన్‌రెడ్డి

పెద్దమందడి, మే 8 : 'తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక పదేళ్ల కేసీఆర్ పాలన, కాంగ్రెస్ ఐదు నెలల పాలన మీ కండ్ల ముందే కనిపిస్తుంది.. కేసీఆర్ సంక్షేమమైతే.. కాంగ్రెస్ క్షామం'అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దొడగుంటపల్లి, పామిరెడ్డిపల్లిలో ఎంపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. పదేండ్లలో కేసీఆర్ ఇచ్చిన హామీలతో పాటు చెప్పని పనులు కూడా చేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఆ తర్వాత గ్యారెంటీల అమలును విస్మరించిందన్నారు. ప్రజలు మరోసారి కాంగ్రెస్ మాయలో పడి మోసపోవద్దని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే ప్రజలకు అండగా ఉంటామన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో బుద్ధిచెప్పాలన్నారు. ఆరు నెలల్లో ఆరు లోకాలు చూపిస్తున్నారని ప్రజలే స్వయంగా చెబుతున్నారన్నారు. ఐదేండ్లుగా ఎండిపోని చెరువులు, కుంటలు ఇప్పుడెందుకు ఎండిపోయామని ప్రశ్నించారు. 'రిజర్వాయర్లలో నీళ్లున్నా పంటలు ఎండిపోవడానికి కారకులెవరు? నీళ్లు తీసుకొచ్చే సోయిలేక పంటలను ఎండబెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీది' అని విమర్శించారు. ఏ పార్టీ మంచి చేసింది? ఏ పార్టీ ఇబ్బందులకు గురిచేస్తుందని ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. అనంతరం ఉపాధి కూలీలతో కలిసి గంపను నెత్తిన మోస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, నాయకులు వేణుయాదవ్, రాజాప్రకాశ్‌రెడ్డి, మన్యపురెడ్డి, దయాకర్, నాగేంద్రరావు, శ్రీనివాస్‌రెడ్డి, జానకీరాములు, చిన్నారెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, చెన్నయ్య, సురేశ్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, కార్యకర్తలు తదితరులున్నారు.



ఉపాధి కూలీలతో కలిసి తలపై గంపను పెట్టుకొని ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి